ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
3
శనివారం 6 ఏప్రిల్ 2024





రామడుగు మండలం వెదిరలో రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్

ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి



- ప్రచారంలో ముందుకు సాగుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- గెలుపుధీమాలో మూడు పార్టీలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణలో కీలక రాజకీయ క్షేత్రంగా భావించే కరీంనగర్ లోక్‌సభ స్థానంలో అభ్యర్థిని ఎంపిక చేయడంలో కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గాన్ని కైవసం చేసుకున్న భారతీయ జనతా పార్టీ దానిని తిరిగి దక్కించుకోవడానికి సిట్టింగ్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్య దర్శి బండి సంజయ్‌కుమార్‌ను అభ్యర్థిగా ప్రక టించింది. బీఆర్ఎస్ కేసీఆర్‌కు సెంటిమెంట్ జిల్లా అయిన కరీంనగర్‌లో పాగా వేయడానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసింది. కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్ర ఢిల్లీ స్థాయిలో పదేసి సార్లు పార్టీ ఎన్నికల కమిటీ సమావేశాలు నిర్వహించినా అభ్యర్థిని ఖరారు చేసే విషయంలో నిర్ణయం తీసుకోలేక పోయింది.

ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి పలువురు దరఖాస్తులు చేసుకున్నా మాజీ శాసనసభ్యుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, వెలిచాల రాజేందర్, రుద్ర సంతోష్ కుమార్ పేర్లను పరిశీలి స్తున్నది. ప్రవీణ్‌రెడ్డికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులు ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుస్నాబాద్ నుంచి టికెట్ ఆశించిన ప్రవీణ్‌రెడ్డిని కాదని ఆ స్థానంలో ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అవకాశం కల్పించారు. ఆ సందర్భంలో రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ కేంద్ర నాయకత్వం ప్రవీణ్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవి కానీ లోక్‌సభ టికెట్ కానీ ఇస్తామని హామీ ఇచ్చారని సమా చారం. ఆ మేరకే రేవంత్‌రెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును ప్రతి పాదించడంతో రాష్ట్ర ఎన్నికల కమిటి ఈ స్థానానికి ఆయన పేరును మాత్రమే కేంద్ర కమిటీకి పంపించింది. అయితే కేంద్ర కమిటీ ముగ్గురు పేర్లను పరిశీలనలోకి తీసుకున్నది.

వీరిలో ప్రవీణ్‌రెడ్డికి గానీ రాజేందర్‌రావుకు గానీ అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి ఇప్పటికే ఆరు స్థానాలను కేటాయించారు. పెండింగ్‌లో ఉన్న ఖమ్మం, కరీంనగర్ నియోజకవర్గాల్లో ప్రధాన పోటీలో రెడ్డి అభ్యర్థులే ఉండ డంతో వీరిలో ఒకరికి అవకాశం దక్క వస్తుందని భావిస్తున్నారు. ఖమ్మంలో రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం కల్పిస్తే కరీంనగర్‌లో వెలమ సామాజిక వర్గానికి చెందిన రాజేందర్‌రావుకు, అక్కడ వేరే వారికి అవకాశమిస్తే ప్రవీణ్‌రెడ్డికి టికెట్ దక్కవచ్చని భావిస్తున్నారు.

బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు పాత కాపులే

ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థిత్వాలు ఖరారైన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు గత ఎన్నికల్లో పోటీపడిన పాత ప్రత్యర్థులే. కాంగ్రెస్ నుంచి ఏ అభ్యర్థిని ప్రకటించినా ఆయన ఈ సారి కొత్తవారే అవుతారు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పోటీచేశారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బండి సంజయ్‌కుమార్ గత ఎన్నికల్లో 4,78,916 ఓట్లు పొంది విజయం సాధించారు. ఆయన సమీప ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌కు 4,00,552 ఓట్లు వచ్చాయి. మూడోస్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు 1,76,756 ఓట్లు పోలయ్యాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కొంత డీలా పడిపోగా, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోటీగా సాగింది. ఈసారి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం, ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నాలుగు సెగ్మెంట్లలో ఆ పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు విజయం సాధించారు.

మరో మూడు స్థానాల్లో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. దీనితో ఈ రెండు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో విజయంపై ఆశలు పెంచుకున్నాయి. అయితే బీజేపీ మాత్రం తమ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుంటామన్న ధీమాతో ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే తమకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రెట్టింపు ఓట్లు రావడంతో ఈసారి గెలుపు మరింత సులువవుతుందని ఆ పార్టీ భావిస్తున్నది. ఈ నేపథ్యం లో ఇక్కడ ముక్కోణపు పోరు జరిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ప్రచారంలో దూకుడు పెంచిన బీజేపీ, బీఆర్ఎస్

కాంగ్రెస్ ఇంకా అభ్యర్థి ఎంపికలోనే తేల్చుకోలేక పోతుండగా బీజేపీ, బీఆర్ఎస్ మాత్రమే నామినేషన్లకు ముందే ఒకటిరెండు సార్లు నియోజక వర్గంలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో పర్యటించి ప్రచారం పూర్తిచేస్తున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ నాయకులు, శ్రేణులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి వివిధ కుల సంఘాల పెద్దలను, సంస్థల ప్రతినిధులను, రాజకీయాలను ప్రభావితం చేసే వర్గాలను గుర్తించి వారితో ఇప్పటికే సమావేశాలు, భేటీలు నిర్వహించాయి. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర పేరిట నియోజకవర్గంలోని సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూర్, కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకుంటూ గడిచిన టర్మ్‌లో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆయా గ్రామాలకు నిధులు, చేపట్టిన పనులు, రాబోయే రోజుల్లో చేపట్టదలచిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రచారం చేస్తూ వచ్చారు. బీజేపీ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన విజయసంకల్పసభను జగిత్యాలలో ఏర్పాటు చేయగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ సభలో ప్రసంగించి వెళ్లారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని అభ్యర్థిని పరిచయం చేసి గెలిపించాలని కోరారు. ఈ రెండు పార్టీలు ప్రచారంలో అధికార కాంగ్రెస్ కంటే ముందుండడం అభ్యర్థి ఎవరో తేలక పోవడం కాంగ్రెస్‌శ్రేణుల్లో నిరుత్సాహాన్ని కలిగిస్తున్నదని చెబుతున్నారు.

తొలి నుంచి వెలమలదే ఆధిపత్యం

కరీంనగర్ లోక్‌సభ స్థానం ఏర్పడినప్పటి నుంచి వెలమల ఆధిపత్యమే కొనసాగుతూ వస్తున్నది. 1952లో ద్విసభ్య నియోజకవర్గంగా కరీంనగర్ లోక్‌సభ స్థానం ఏర్పడగా 16 సార్లు సాధారణ ఎన్నికలు, మూడు ఉప ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గం నుంచి 15 పర్యాయాలు వెలమ అభ్యర్థులు, మూడు సార్లు బీసీ నాయకులు, ఒకసారి రెడ్డి సామాజిక వర్గం నేతలు, రెండుసార్లు ఎస్సీ అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీల వారిగా పదిసార్లు కాంగ్రెస్, మూడు సార్లు బీజేపీ, నాలుగు సార్లు బీఆర్ఎస్, టిడిపి, తెలంగాణ ప్రజా సమితి, పీడీఎఫ్, ఎన్‌సీఎఫ్ ఒక్కోసారి విజయం సాధించాయి.

అండగా ఉంటాం

- మేడిగడ్డలో పదివేలమంది రైతులతో ధర్నా
- నష్టపోయిన రైతులకు 25 వేల నష్టపరిహారం అందించాలి
- మాజీ సీఎం కేసీఆర్.. ముగ్దుంపూర్‌లో ఎండిన పంటల పరిశీలన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని అధైర్య పడవద్దని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్దుంపూర్ గ్రామంలో ఎండిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదని రైతుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు.

ఈ సందర్భంగా ముగ్దుంపూర్ గ్రామానికి చెందిన రైతులు తమ పంటలు ఎండి పోతున్నాయని కేసీఆర్‌తో మొరపెట్టుకున్నారు. మాజీ సర్పంచ్ జక్కం నర్సయ్య మాట్లాడుతూ ముగ్దుంపూర్ గ్రామంలో పంటలు ఎండుతున్నా పట్టించుకునేవారు లేరన్నారు. ఎస్ఆర్ ఎస్పి డి89 కెనాల్ ద్వారా ఇరుకుల్ల (గుండి) వాగు ద్వారా చెరువుల్లోకి సమృద్ధిగా నీరందితే పంటలు ఎండి పోయే పరిస్థితులు ఉండేవి కావని తెలిపారు. గత పంట కాలంలో ఒక్క ముగ్దుంపూర్ నుంచే 18 వేల క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నాం. ప్రస్తుతం 6 వేల క్వింటాళ్లు కూడా కొనుగోలు కేంద్రాలకు తరలించే పరిస్థితి లేదని మొర పెట్టుకున్నారు. ముగ్దుం పూర్ గ్రామంలో 1000 ఎకరాలకుగాను 600 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. మరో రెండు విడతల సాగునీరు అందితే రైతుల పంటలు దక్కేవని కేసీఆర్‌కు మొర పెట్టుకున్నారు. రైతులు బండి సంపత్‌తోపాటు, కొలగాని సంపత్, వేల్పుల నర్సయ్య, దాడి లచ్చయ్య, కొలగాని రాజయ్య, దాడి కనుకయ్య, బొల్లె బాలరాజు, వాగటి హన్మయ్య, దుర్గ మల్లయ్య, చంద్రయ్య, మంద తిరుపతి, అంజిరెడ్డి, అంజయ్యలు తమ పొలాలు ఎండి పోయాయని కేసీఆర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా కేసీఆర్ రైతుల భుజం తట్టి అధైర్య పడవద్దు అండగా ఉంటామన్నారు. ఎన్నికల అనంతరం మేడిగడ్డలో పెద్ద ఎత్తున రైతులతో ధర్నా నిర్వహిస్తామన్నారు. బండి సంపత్ అనే రైతు తన పొలాన్ని చూపిస్తూ తాను మూడున్నర ఎకరాలు సాగుచేశానని పంట మొత్తం పశువుల మేతకే పనిచేస్తుందన్నారు. దాడి లచ్చయ్య అనే రైతు తాను ఐదున్నర ఎకరాలు కౌలు తీసుకుని సాగు చేశానని పూర్తిగా సాగునీరు లేక ఎండిపోయిందన్నారు. రైతుల పంటలను పరిశీలించిన కేసీఆర్ రైతులకు భరోసా కల్పిస్తూ అధైర్య పడవద్దు మీకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. రైతుల పంట లు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ఎండి పోయిన పంటలకు రైతులకు ఎకరాకు 25 వేల రూపాయల నష్ట పరిహారం అందించాలన్నారు.

మేడిగడ్డలో పదివేల మంది రైతులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపడుతామన్నారు. ఒక వైపు పంటలు ఎండిపోతుంటే పట్టించుకోవడం లేదు. రైతులు ధైర్యంగా ఉండి పోరాటం చేయాలన్నారు. మరో రెండు విడతలు కాలువల ద్వారా నీరందిస్తే రైతుల పంటలు చేతికొచ్చేవన్నారు. ప్రభుత్వం సాగునీరు అందించే విషయంలో ముందుచూపు లేకుండా పోయిందన్నారు. రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యుడు గంగుల కమలాకర్, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు, చల్ల హరిశంకర్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

రామడుగులో...

రామడుగు: ఎండిపోయిన వరితో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు మండలంలోని వెదిర గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం మొరపెట్టుకున్నారు. రామడుగు నుంచి బోయినిపల్లికి వెళుతున్న కేసీఆర్ బస్సు యాత్రను రైతులు వరి గొలుసుతో స్వాగతం పలికారు. రైతులు రావడంతో బస్సు దిగిన కేసీఆర్ వారితో కొద్దిసేపు ముచ్చటించారు. సాగునీరు సక్రమంగా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు కేసీఆర్ దృష్టికి తీసుకవచ్చారు. విద్యుత్ సరఫరాలో పలు సార్లు అంతరాయం ఏర్పడి పంటలు ఎండిపోతున్నాయని ఏకరువు పెట్టారు. స్పందించిన కేసీఆర్ అధైర్యపడవద్దని ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఉన్నారు.

గంగాధరలో...

గంగాధర: ఎండిన పంటల పరిశీలనలో భాగంగా శుక్రవారం కరీంనగర్ నుంచి బోయినపల్లికి వెళ్తూ గంగాధర మండలం కురిక్యాల రోడ్డుపై రైతులతో ఆయన వాహనంలో ఉండి మాట్లాడారు. గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్ మాట్లాడుతూ నీరు లేక వరద కాలువ ఆయకట్టు 8 ఎకరాలు ఎండిపోయినట్లు తెలిపారు. మరో రెండు వందల ఎకరాలు ఎండిపోవడానికి సిద్ధంగా ఉందని మాజీ సీఎంకు తెలిపారు. స్పందించిన కేసీఆర్ కురి క్యాలలో రైతు అందించిన వరి గొలకను తీసుకుని సాగునీటి కోసం సిద్ధమేనా అని రైతులను ప్రశ్నించారు. రైతులకు సాగునీరందించే వరకు పోరాటం చేసుడేనని కేసీఆర్ అన్నారు.



ముగ్దుంపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

విద్యాశాఖలో నిధుల పక్కదారి?



- ఎల్ఎండీ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల బిల్లులు మాయం
- దొంగ చలాన్లు సృష్టించి డబ్బులు పక్కదారి
- సుమారు రూ.10 లక్షల వరకు స్వాహా

తిమ్మాపూర్, ఏప్రిల్ 5: తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ జిల్లా పరిషత్ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో చలాన్ల ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన నిధుల్లో గోల్‌మాల్ జరిగింది. ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని కొందరు ఉపాధ్యాయుల లీవులకు సంబంధించిన డబ్బు బ్యాంకులో జమచేయాల్సి ఉంది. ఉపాధ్యాయుల నుంచి సేకరించిన ఈ డబ్బు బ్యాంకులో చెల్లించకుండా పక్కదారి పట్టించినట్లు సమాచారం. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు విడుదలలో రెండు సంవత్సరాలుగా జాప్యం జరుగుతుండటంతో అనుమానం వచ్చిన కొందరు ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించారు.

ఎల్ఎండీ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల లీవులకు సంబంధించిన ఎలాంటి చలాన్లు జమకావడం లేదని అధికారులు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఉపాధ్యాయులు సంబంధిత బ్యాంకుకు వెళ్లి తమ పేర చలాన్లు తీసి డబ్బులు ఏమైనా కట్టారా అని వివరాలు తెలుకున్నారు. ఎల్ఎండీ కాంప్లెక్స్ సిబ్బంది కట్టినట్లు చూపిస్తున్న చలాన్లు బ్యాంకులో చూపించగా అవి తప్పుడు చలాన్లుగా నిర్ధారణ అయింది. సుమారు 22 బిల్లులు, 10లక్షల రూపాయలకు పైగా ట్రెజరీలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజభానును వివరణ కోరగా జూనియర్ అసిస్టెంట్ కొందరు ఉపాధ్యాయుల బిల్లులు బ్యాంకులో జమ చేయలేదని తేలిందన్నారు. దీన్ని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని దానిపై జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం అందించామన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపించండి : పీఆర్టీయూ

కరీంనగర్ టౌన్: ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల నిర్వహణ, వారి జీతభత్యాలు చూడాల్సిన అధికారే వారి సొమ్మును దాదాపు రూ.10 లక్షల మేరకు స్వాహా చేశారని, దీనిపై శాఖాపరంగా సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.తిరుపతిరెడ్డి, డి.శ్రీనివాస్, డి.శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యా శాఖ అధికారికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎండీ కాంప్లెక్సు అధికారి పి.రాజభాను చంద్రప్రకాశ్ గత రెండేళ్లుగా ట్రెజరీ నుంచి బిల్లు పాస్‌కావడం లేదని ఉపాధ్యాయులను మభ్యపెడుతూ మెడికల్ లీవ్, చైల్డ్‌కేర్ లీవ్ తదితర సెలవుల్లో ఉపాధ్యాయులు ఉన్న పుడు ఆ జీతం రికవరీ చేసి చలానా పేరుతో జేబులో వేసుకొని తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకోవాలని వారు కోరారు.



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

రంజాన్ వేళలు	
ఇఫ్తార్	6:29 శనివారం
సహర్	4:36 ఆదివారం

బాబు జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక మంచిర్యాల చౌరస్తాలో గల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కలెక్టర్ పమేలా సత్పతి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, సోషల్ వేల్ఫేర్ ఆఫీసర్ నతానియల్, మున్సిపల్ కమిష నర్ శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్ పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమెల్యే, మేయర్, మాజీ వినోద్‌కుమార్

బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మంచిర్యాల చౌరస్తాలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్ రావు, కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు తుల ఉమ, దరువు ఎల్లన్న, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, నాయకులు మేడి మహేశ్, బోయినిపల్లి చంద్రయ్య, పూసాల సంపత్, వనపర్తి శంకర్ పాల్గొన్నారు.

పూలమాల వేసిన కవ్వంపల్లి

బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ మంచిర్యాల చౌరస్తాలోగల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, రాష్ట్ర స్టీరింగ్ కమిటి చైర్మెన్ గజ్జల ఆనందరావు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ దేశానికే ఆదర్శం : డీఈవో

బాబు జగ్జీవన్‌రామ్ దేశానికే ఆదర్శమని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్‌రావు అన్నారు. శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నగరంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లోని పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ యూనియన్ నాయకుడు కొడముంజ శంకర్, ఎస్టీయూ నాయకుడు కె రవీందర్, టీపీటీఎఫ్ నాయకుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, ఆర్‌జేయూపీ నాయకుడు ఎస్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

- టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఎస్సీ సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు బోలుమల్ల సదానందం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య, పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పోతుల రమేశ్, మేకల రాయమల్లు, కనకయ్యపాల్గొన్నారు.
- బాబు జగ్జీవన్‌రామ్ అలుపెరుగని పోరాట యోధుడని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ అన్నారు. మంచిర్యాల చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఒకరి రిమాండ్

కోనరావుపేట ఏప్రిల్ 5: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి తలుపులు కొడుతూ వస్తువులను ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన రాజేష్ బుధవారం అర్ధరాత్రి మామిడిపల్లిలోని పలు దుకాణాల డోర్ కొట్టి భయభ్రాంతులకు గురి చేశాడు. రిఫ్రిజిరేటర్‌లను ధ్వంసం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో రాజేష్‌ను అరెస్ట్ చేసినట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి కార్మికుడి మృతి

- అనాథలైన ఇద్దరు కుమారులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చి పూజారి శ్రీనివాస్(30) అను కార్మికుడు వాగులో పడి శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన గ్రామానికి చెందిన శ్రీనివాస్ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శ్రీనివాస్ భార్య మృతి చెందడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి పని చేసుకుంటున్నాడు. చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రి డ్జి నిర్మాణంలో తోటి కూలీలతో కలిసి పనికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కూలీలు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే శ్రీనివాస్ నీటిలో మునిగి మృతి చెందాడు. తల్లి, దండ్రిని ఇద్దరిని కోల్పోయిన ఆ ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు.

రైలు నుంచి పడి ఒకరి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 5: జమ్మికుంట రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి పడి మృతి చెందాడు. మృతుడి వయస్సు 35-40సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. గుర్తు తెలియని రైల్లో నుంచి పడటం వల్లే మృతి చెంది ఉంటాడని రైల్వే పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

గన్నేరువరం, ఏప్రిల్ 5: మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన వేములవాడ స్వప్న(32) అనారోగ్యంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్వప్న తల్లి కలవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించం

- తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే సహించేది లేదని, మేము మిమ్మల్ని మార్చేస్తామని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. పిల్లి సుధాకర్ చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుంది. నగరంలోని కోర్టు చౌరస్తాలో స్థానిక నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. సుధాకర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మూలస్తంభాలుగా డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అది నచ్చని మనువాద, మతతత్వ పార్టీలు ఈ ఎన్నికల్లో 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అదే జరిగితే మౌలిక సుత్రాల పునాదులు ధ్వంసం అవుతాయని, జీవించే హక్కు, మాట్లాడే హక్కు కోల్పోతామన్నారు. ప్రతీ పౌరుడు ఈ చర్యను ఖండించాలన్నారు. అంబేడ్కర్ అందించిన ఓటు హక్కుతో బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మాలలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, రాష్ట్ర ప్రధానాకార్యదర్శి మేడి అంజయ్య, కార్యదర్శి గూడ కనకయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ళ వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, కార్పొరేటర్ గంట కళ్యాణి, శ్రీనివాస్, దామెర సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, మహిళ నాయకురాళ్ళు తీట్ల ఈశ్వరి, ఎలుక దేవయ్య, వెన్న రాజు, కె చందరయ్య, మొగురం రమేశ్, ప్రసాద్, రామచంద్రం, సత్యం, పి భూమ య్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అక్కపల్లి గ్రామానికి చెందిన పోతుల గాంధీబాబు, మందాటి సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాంధీబాబు తన బైక్‌పై అక్కపల్లి నుంచి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్న క్రమంలో ఇటు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న అదే గ్రామవాసి సురేశ్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాంధీబాబు రెండు కాళ్లు విరిగిపోయాయి. సురేశ్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

బస్టాండ్‌లో మహిళ వద్ద బంగారం చోరీ

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 5: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఓ ప్రయాణీకురాలి నుంచి శుక్రవారం 15 తులాల బంగారాన్ని దొంగలు అప హరించారు. మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్ ప్రాంతానికి చెందిన సురిగి మంగారాణి తన కూతురుతో కలిసి బీర్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి మెట్‌పెల్లికి వెళ్లేందుకు కొత్త బస్టాండ్ చేరుకుని బస్సు కోసం వేచి ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మాటల్లోకి దింపి బ్యాగులో ఉన్న 15 తులాల బంగారు నగలను అపహరించారు. తేరుకున్న మంగారాణి తన బ్యాగులో ఉన్న బంగారం చోరీకి గురైందని తెలుసుకుని జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ సీఐతో పాటు ఎస్సై తన సిబ్బందితో బస్టాండ్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గర్షకుర్తిలో కిడ్నాప్ కలకలం

గంగాధర, ఏప్రిల్ 5: గర్షకుర్తి వాసి కిడ్నాప్‌నకు గురయ్యాడని సోషల్ మీడియాలో వైరల్ కావడం మండలంలో కలకలం రేపింది. కిడ్నాప్‌కు గురైన వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి అడవి ప్రాంతంలో పడేసినట్లు వీడియోలు వాట్సప్ గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. గర్షకుర్తికి చెందిన బూత్కురి దావీదు (35) గ్రామంలో సీఏగా పని చేస్తున్నాడు. కాగా మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లినట్లు సమాచారం. శుక్రవారం నిర్మల్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారి పక్కన అటవీ ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అటువైపు నుంచి జగిత్యాల వస్తున్న ఓ ట్రాలీ వాహనం యాజమాని దావీదును గుర్తించి ఎవ్వరని ప్రశ్నించాడు. తమది గంగాధర మండలం గర్షకుర్తి అని తనను కిడ్నాప్ చేశారని దావీదు చెప్పాడు. దావీదును వాహన యాజమాని జగిత్యాలకు తీసుకువచ్చి అతడి బంధువులకు సమాచారం అందించాడు. ప్రస్తుతం దావీదు అతని బావ వద్ద ఉన్నట్లు తెలిసింది. దీనిపై ఎస్సై కిరణ్ రెడ్డిని వివరణ కోరగా గర్షకుర్తిలోని దావీదు ఇంటికి పంపించి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. కిడ్నాప్‌కు గురైనట్లు దావీదు చెప్పుతున్న వీడియోలు వాట్సప్‌లో వైరల్ అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఆయన జగిత్యాలలోని అతని బావ వద్ద ఉన్నాడని వివరించారు. అసలు కిడ్నాప్‌నకు గురైయ్యాడా, లేక ఏమైందనే విషయంపై ఆరాతీస్తున్నామని, అనుమానం ఉంటే ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్



తిమ్మాపూర్‌లో జేఈఈ పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్‌5: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. అభ్యర్థులను పరీక్ష సమయానికి రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి షిప్ట్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిప్టులలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఒక్క పరీక్ష కేంద్రాంలోనే జరిగాయి. మొదటి షిప్టులో 678 మందికి 612 మంది, రెండో షిప్టులో 677 మందికి 620 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ కండువా వేస్తున్న దీప్‌దాస్‌మున్షీ

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5: మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి సమక్షంలో, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షీ హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, బీసీ సంఘం నేత బూస అంజయ్య యాదవ్‌ను పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు, దేశ సమైక్యత కోసం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ అనుసరిస్తున్న సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌పార్టీలో చేరానని ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరి విష్ణునాథ్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాష్ట్ర ఓబీసీ సెల్ సమన్వయకర్త బద్దికుంట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇరుకుల్లలో అగ్నిప్రమాదం

- కాలిన సపోటా చెట్లు
- రూ. 20 లక్షల మేర నష్టం అంచనా

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి చెందిన సపోటా తోటలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. అక్కడ ఉన్న వాచ్‌మన్ భోజనానికి వెళ్లిన సమయంలో మంటలు అంటుకుని చెట్లు దగ్ధమయ్యాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. మధ్యాహ్నం సమయంలో సపోటా తోటలో అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందుకున్న వెంటనే ఫైరింజన్‌తో సహా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకవచ్చామని తెలిపారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియలేదని, విచారణ జరుపుతున్నామని అన్నారు. సపోటా చెట్లకు మంటలు అంటుకోవటంతో చెట్లు భారీగానే కాలిపోయాయని తెలిపారు. సుమారు 20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నామని అన్నారు. సుమారు 10 ఎకరాలలో సపోటా చెట్లు ఉన్నట్లు తెలిపారు.

● వస్త్ర దుకాణంలో..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ టవర్ ప్రాంతంలోని ఒక వస్త్ర దుకాణంలో శుక్రవారం ఉదయం 5 గంట ల సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. భువన కిడ్స్ షాపులో మంటలు అంటుకోవటంతో స్థానికులు కరీంనగర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు అంటుకున్నాయని, ఈ ప్రమాదంలో కొన్ని దుస్తుల, బ్యాంగిల్స్ కాలిపోయాయని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సంఘటనపై విచారణ జరుపుతున్నామని అన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో రోడ్డు పక్కన మంటలు అంటుకున్నాయని వచ్చిన సమాచారం మేరకు ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేశామని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.



కాలిపోయిన సపోటా చెట్లు

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- బీఎస్పీ సెంట్రల్ కో-ఆర్డినేటర్ ఎం బాలయ్య



మాట్లాడుతున్న ఎం బాలయ్య

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే బహుజనులు శాశ్వత బానిసలు అవుతారని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ కో ఆర్డినేటర్ ఎం బాలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్ముడుపోని నాయకులు కావాలని అన్నారు. వారు మాత్రమే బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతారని, అందుకే అమ్ముడుపోని నాయకులు, కార్యకర్తలను తయారు చేసుకోవాలన్నారు. కార్యకర్తలే బహుజన ఉద్యమానికి వనరులు ఇస్తారని అన్నారు. కేంద్రంలో అధికారంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల పేరిట కార్పొరేట్ కంపెనీల నుంచి వేలకోట్ల రూపాయలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. బహుజన ఉద్యమం ఉన్నత విద్యావంతులకు అర్థం కాకపోవడం బాధాకరమని వాపోయారు. నేడు దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందన్నారు. రాజ్యాంగాన్ని మనం కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగాన్ని మారిస్తే బీసీలు బానిసలు కారా? అని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. తెలంగాణలో కరీంనగర్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇక్కడ ఎన్నో ఉద్యమాలు పుట్టాయని, అందులో జగిత్యాల జైత్రయాత్ర, సాయుధ రైతాంగ పోరాటాలు ఇక్కడే పురుడు పోసుకున్నాయన్నారు. దేశంలో బీజేపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు అన్ని ఒక్కటే అని అన్నారు. కాంగ్రెస్ వారు లౌకిక వాదులు కానేకారని అన్నారు. బీఎస్పీకి తప్ప ఇతర పార్టీకి ఓటేసినా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వండి మేము రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు బాహాటంగా మాట్లాడుతున్నారన్నారు. బహుశా ఇవే చివరి ఎన్నికలేమో అని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జీ అంకని భాను, నిషాని రామచంద్రం, పుప్పాల లింబాద్రి, రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, దొడ్డె సమ్మయ్య, రంగు సంపత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాల శ్రీనివాస్, జగిత్యాల ఇన్‌చార్జి చిర్ర శంకర్, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యాదాసి రవీందర్, పెద్దపల్లి ఇన్‌చార్జి వరికిళ్ళ మల్లేశ్, బాలకల్యాణ్, జిల్లా అధ్యక్షుడు రాజనర్సయ్య, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి చాకలి రమేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

- 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం



ముత్తయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5: ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిరిపురం ముత్తయ్య (58) అనే రైతు పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు ముత్తయ్య తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేయడంతోపాటు స్థానికంగా భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో ఏడాది కిందట రూ.2 లక్షలు అప్పు చేసి కొడుకు శ్రీనివాస్‌ను బహ్రెయిన్ పంపించాడు. మరో రూ.2 లక్షలు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇంటి నిర్మాణం అర్థంతరంగా నిలిచిపోయింది. పనులు లభించక కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు తీర్చే మార్గం కానరాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 4న పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ముత్తయ్యను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కన్నకొడుకు గల్ఫ్ దేశంలో ఉండడంతో భర్తకు భార్య దేవలక్ష్మీ అంతిమ సంస్కారాలు నిర్వహించడం స్థానికులను కంట తడి పెట్టించింది. మృతుడి భార్య దేవలక్ష్మీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా నిల్వచేసిన 21 క్వింటాళ్ల గన్‌పౌడర్ పట్టివేత

సైదాపూర్, ఏప్రిల్ 5: సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి గ్రామ శివారులో సమాచారం మేరకు ఓ రూంలో అక్రమంగా నిల్వ చేసిన 21.30క్వింటాళ్ల గన్ పౌడర్‌ను హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ హుజూరాబాద్‌కు చెందిన మహేందర్ అనే వ్యక్తి జాగీర్‌పల్లి శివారులోని ఎలాంటి అనుమతులు లేకుండా ఓ రూంలో గన్‌పౌడర్ దాచాడనే సమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. అందులో 142 బాక్సులలో గన్ పౌడర్ ఉందన్నారు. దాని విలువ సుమారు రూ. 74,764 ఉంటుందని వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ గన్ పౌడర్‌ను క్వారీలలో శబ్దం రాకుండా బండ పగుల గొట్టడానికి ఉపయోగిస్తారని, దీన్ని పూర్తి అనుమతులతోనే ఉపయోగించాల్సి ఉంటుదని స్థానికంగా చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

8న మెడికల్ కాలేజీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కొత్తపల్లిలోగల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిపై ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కాలేజీ వెబ్‌సైట్‌లోగల అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పూరించి ఈనెల ఏడో తేదీలోగా కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో సమర్పించాలని కోరారు. ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాలేజీలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న పంట

సైదాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని గొడిశాల గ్రామ శివారులో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తాడూరి రాజకుమార్ అనే రైతు కోతకు వచ్చిన రెండెకరాల మొక్కజొన్న పూర్తిగా కాలిపోయిది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం వేళలో 11కేవీ వైర్ల రాపిడికి నిప్పు రవ్వలు కోతకు వచ్చిన మొక్కజొన్నలో పడడంతో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని చుట్టు పక్కల పంటలలోకి వెళ్లకుండా మంటలు ఆర్పారు. మంటలు ఆర్పే క్రమంలో రాజ్‌కుమార్ భార్య స్పృహ తప్పి పడిపోయిందని తెలిపారు. రెండకరాల మొక్కజొన్న దెబ్బతినడంతో తనకు సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చిందని రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 5: మండలంలోని నుస్తులాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ ప్రయివేటు బస్సు ఢీ కొట్టగా తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని రామచంద్రపూర్ కాలనీకి చెందిన చిక్యాల సాగర్‌రావు(69) కారులో హుస్నాబాద్ సమీపంలోని ఓ గ్రామంలో ఓ ఫంక్షన్‌కి స్నేహితులతో కలిసి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని నుస్తులాపూర్ వద్ద వాహనం నిలిపివేసి వాటర్ బాటిల్ కొనేందుకు స్నేహితులు ముగ్గురితో పాటు సాగర్ రావు రోడ్డు దాటుతున్నాడు. కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు అతివేగంగా వచ్చిన ఓ ప్రైవేటు బస్సు రోడ్డు దాటుతున్న సాగర్‌రావును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయలతో సాగర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. సాగర్‌రావు(భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. సాగర్‌రావు తపాలా కార్యాలయంలో పని చేసి పదవీ విరమణ పొందాడు. సంఘటన స్థలానికి ఎల్ఎండీ ఎస్సై చేరాలు చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

దండేపల్లి, ఏప్రిల్ 5 : దండేపల్లి మండల కేంద్రంలోని మల్లన్న గుడిలో, అంబేద్కర్ చౌరస్తాలో ఆటోను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై స్వరూప రాజ్ తెలిపారు. శుక్రవారం గూడెం ఫారెస్టు చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఆటోతో వచ్చిన తూర్పాటి కనకయ్య (రేకుర్తి కొత్తపల్లి, కరీంనగర్), పత్తి కనక రాజు (హనుమాన్‌నగర్, కరీంనగర్)లను అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారన్నారు. నిందితుల నుంచి ఒక ఆటో ట్రాలీ, ద్విచక్ర వాహనంతో పాటు మల్లన్న గుడిలో చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



రుషి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 5: తల్లిని కొట్టాను అన్న పశ్చాత్తాపంతో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన నేరెళ్ల అంజయ్య - లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు నేరెళ్ల రుషి (18) తరచూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వచ్చిన రుషిని తల్లి మందలించింది. తండ్రి తాడి చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడి మంచాన పడగా ఇలా అర్ధరాత్రిలు రావడం ఏంటని ప్రశ్నించింది. తీవ్ర ఆగ్రహానికి లోనై విచక్షణ కోల్పోయిన రుషి తల్లితో పాటు తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం అదే రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన రుషి శుక్రవారం తెల్లవారు జామున ఇంటి పైఅంతస్తుకు చేరుకొని తల్లిని కొట్టిన పశ్చాత్తాపంలో మనోవేదనకు లోనై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

సవతి తండ్రిని హత్య చేసిన తనయుడు



అంబాదాస్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 5: జల్సాలు మాని పని చేసుకోవాలని మందలించిన సవతి తండ్రిపై కోపం పెంచుకున్న తనయుడు శుక్రవారం హత్య చేశాడు. పోలీసులు, గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్ దుర్గమ్మ కాలనీకి చెందిన అంబాదాస్ (54) తన రెండో భార్య భోజమ్మతో పాటు ఆమె కుమారుడు రవితేజతో కలిసి జీవిస్తున్నారు. రవితేజ పని చేయకుండా జల్సాలు చేసుకుంటూ తిరగడంతో అంబాదాస్ మందలించాడు. ఇలా రోజు ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి అంబాదాస్‌పై రవితేజ కోపం పెంచుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో పడుకొని ఉన్న అంబాదాస్‌పై పదునైన ఆయుధంతో మెడపై కొట్టి పారిపోయాడు. తలపై తీవ్ర గాయం కావడంతో అంబాదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో పడిఉన్న అంబాదాస్‌ను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొన్నారు. ఈ మేరకు పరారీలో ఉన్న రవితేజ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో మెట్‌పల్లి వాసి

మెట్‌పల్లి, ఏప్రిల్ 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన మొహమ్మద్ ఇమ్రాన్ సైబర్ మోసానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3వ తేదీన సేబర్ మోసగాళ్లు ఇమ్రాన్‌కు ఫోన్ చేసి డిస్కౌంట్ల పేరుతో ఆఫర్ల ఆశ చూపడంతో ఇమ్రాన్ నమ్మాడు. కొంత సమయం తరువాత వారికి ఓటీపీలు చెప్పడంతో కాసేపటికి ఇమ్రాన్ అకౌంట్ నుంచి రూ. 27,440 కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. తరువాత వారికి ఫోన్ చేస్తే కలవకపోవడంతో మోసపోయినట్లు భావించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'ప్యారడైజ్'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 5: రేకుర్తిలోని ప్యారడైజ్ పాఠశాల ప్రీప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సెయింట్ జార్జ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ పి పాతిమారెడ్డి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మౌనిక జ్యోతి ప్రజ్వలన చేసి క్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాతిమారెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రత్యేక అతిథి డాక్టర్ మౌనికారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమపిల్లలను ఆరోగ్యవంతులుగా పెంచాలన్నారు. బాల్యం నుంచి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపల్స్ టి వసంత, భార్గవ్, నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ ఎ మధు, ఇన్‌చార్జి సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల పేరుతో ఒంటిపై బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: పోలీసులమంటూ ఒక వృద్ధుడి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు భద్రపరుచుకోమని జాగ్రత్తలు చెప్పి, ఆదమరచి ఉన్న సమయంలో నాలుగు తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన ఘటన శుక్రవారం కరీంనగర్‌లో చోటుచేసుకుంది. కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీరోడ్‌లో నివాసం ఉంటున్న గజవాడ రవీందర్(68) శుక్రవారం ఉదయం 10:30 గంటలకు సమీపంలోని గీతామందిర్‌కు ఒంటరిగా నడిచి వెళుతుండగా గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి తాము స్పెషల్‌పోలీసులమంటూ రవీందర్ చేతిలోని బ్యాగ్‌ను చెక్ చేశారు. ఎన్నికల కోడ్ ఉందని, ఇక్కడ దొంగలు బాగా ఉన్నారని, మెడలోని చెయిన్, చేతి ఉంగరాలు తీసి బ్యాగ్‌లో భద్రపరచుకోవాలని సూచించారు. రవీందర్ మెడలోని మూడు తులాల చెయిన్, తులం బరువున్న రెండు ఉంగరాలను తీసి పేపర్ కవర్‌లో పెట్టుకోబోయాడు. గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాల కవర్‌ను జాగ్రత్తగా బ్యాగ్‌లో పెడుతున్నట్లు నటించి మరో కవర్‌ను బ్యాగ్‌లో ఉంచి, బంగారు ఆభరణాల కవర్‌ను ఎత్తుకుపోయారు. కొద్దిసేపటి తరువాత రవీందర్‌కు అనుమానం వచ్చి బ్యాగ్‌లోని కవర్‌ను తెరిచి చూడగా అందులో బంగారానికి బదులు రెండు రాళ్లు కనపడటంతో లబోదిబోమంటూ బాధితుడు తన కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే రవీందర్ కొడుకు, ఇతర బంధువులు సంఘటనాస్థలానికి చేరుకుని గుర్తుతెలియని వ్యక్తుల కోసం గాలించగా కనపడలేదు. ఈ మేరకు బాధితుడి కొడుకు వెంకట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ జరుపుతున్నారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మానకొండూర్, ఏప్రిల్ 5: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి రామానుజ చార్యులు రైతులకు సూచించారు. మానకొండూర్ సింగిల్ విండో పరిధిలోని ముంజంపల్లి, మద్దికుంట, గంగిపల్లి, కొండపల్కల గ్రామాలలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి రైతులు లబ్ధి పొందాలన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి కరణ్‌కుమార్, కార్యదర్శి లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 5: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ నరేందర్ తెలిపారు. కమాన్ ఫీడర్ పరిధిలో గాయత్రీనగర్, లక్ష్మీనగర్, షాషామహల్, మధుగార్డెన్ ప్రాంతం, కోతిరాంపూర్, పోచమ్మవాడ, శక్తి దేవాలయం ఫీడర్ పరిధిలో చైతన్యపురి, శక్తిదేవాలయం ప్రాంతం, సంతోష్‌నగర్, బాలాజీ సూపర్ మార్కెట్ ప్రాంతం, వైద్య నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5: చొప్పదండి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది కోల ప్రభాకర్‌ను జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా, కరీంనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నేత జమాలుద్దీన్‌ను జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కోల ప్రభాకర్, సయ్యద్ జమాలుద్దీన్ తమ నియామకంపై మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 5: కరీంనగర్ యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు జక్కని సంజయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలోని దాసరి విజయ గార్డెన్‌లో ఈనెల 7న నిర్వహించే కరీంనగర్ యుద్ధభేరి సదస్సుకు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఆయనతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు జన్ను స్వరూప, మేకల రవీందర్, కొంకటి శేఖర్, పెద్దల శ్రీనివాస్, బోనగిరి ప్రభాకర్ పాల్గొన్నారు.

మానకొండూర్: కార్యకర్తలు ఈ నెల 7న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ స్థాయి యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి బోనగిరి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్‌లోని అల్గునూర్ నుంచి పద్మనగర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం రేకుర్తిలో పట్టుకున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ ట్రాక్టర్ యజమానులు బత్తిని పర్శరాములు, గుర్రాల చంద్రమౌళిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

జమ్మికుంట, ఏప్రిల్ 5: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల మజీదులో రంజాన్ మాసం సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి ముస్లింలకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేశిని రాధ-సదానందం, ఎలగందుల స్వరూప-శ్రీహరి, పిట్టల శ్వేత-రమేశ్, మాజీ ఉప సర్పంచ్ దేశిని శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, ఉడుత వెంకటేష్, రామచంద్రం, శ్రీను, సురేష్, రాజ్‌కుమార్, షరీఫ్, సునీల్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని జూపాక గ్రామంలోని మజీదులో శుక్రవారం రెడ్డి సంక్షేమ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు రూపిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముస్తఫా, షరీఫ్, రాజిరెడ్డి, రూపిరెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.



అల్విదా జుమ్మా రంజాన్ చివరి శుక్రవారం సందర్భంగా కరీంనగర్‌లోని జఫ్రీ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి







డీసీసీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, గంగాధర కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ విద్యుత్ కార్యాలయంలో..

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంతో పాటు సివిల్ హాస్పిటల్ చౌరస్తాలోని విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మొదట కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, చెర్ల పద్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ పేద బడుగు, బలహీనవర్గాల కోసం జీవితాన్ని ధారపోసిన వ్యక్తిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్‌కుమార్, వెన్న రాజమల్లయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, మంద మహేష్, దండి రవీందర్, మామిడి సత్యనారాయణరెడ్డి, కామరెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, ఏడీలు, అంజయ్య, కిరణ్‌కుమార్, నరేందర్, అన్ని యూనియన్ అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని కరీంనగర్ బస్‌స్టేషన్‌లో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఎన్‌సుచరిత జగ్జివన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ భూపతిరెడ్డి, కె సత్యనారాయణ, చంద్రయ్య, ఎల్ మల్లేశం, వి మల్లయ్య, రజనీకృష్ణ, దొంతరాజయ్య, రాంనర్సయ్య, రజనీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సంఘం పట్టణ అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్, నాయకులు కొత్తూరి మహేశ్, బత్తుల లక్ష్మీనారాయణ, కడారి గంగరాజ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పాటు సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బండ శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్, సుమన్, రత్నం, సుధాకర్, శేఖర్, సతీష్, దయాకర్, నరేష్, శంకర్, రామచంద్రం, వసంత్, ఖాలీద్ హుస్సేన్, రవీందర్, రాజేశ్వర్, సురేష్, జమదగ్ని వెంకటస్వామి, కిరణ్, సొల్లు బాబు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంటలోని జడ్పీటీసీ కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు శ్రీరామ్ శ్యామ్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నిమ్మల శంకర్, నాయకులు పోడేటి అనిల్, అరవింద్, రవి, మనోజ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనుపమ బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్, డేవిడ్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అన్నం ప్రవీణ్, పెద్ది కుమార్, వంగ రామకృష్ణ, సురేష్, రాజేశం, సంతోష్, రఘు, బాబు, కుమార్, అజయ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లో వేడుకలను రొడ్డ అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, నాయకులు తాల్లపల్లి సంపత్, నందగిరి రవీంద్రాచారి, గసిగంటి సంపత్, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, మడుపు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. కార్యక్రమం లో రేమాల రమేశ్, కొలిపాక స్వామి, సత్తు కనుక య్య, బుర్గు గంగన్న, మంత్రి లత పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని తిరుమలాపూర్, గోపాల్‌రావుపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సత్యరాజ్‌వర్మ, శంకర్, త్రినాథ్‌వర్మ, అశోక్, రవిశాస్త్రి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ దీక్ష

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5: ఎండిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ దీక్ష చేపట్టనున్నది. శనివారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ఉదయం 10.30 గంటలకు చేపట్టే ఈ దీక్షలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొంటారని తెలిపారు. పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పెద్దఎత్తున హాజరై దీక్షను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ కోరారు.

కేసీఆర్ సభలో దొంగల చేతివాటం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 5: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొగ్దుంపూర్‌లో పంటలను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంలో దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో ఎండిన పంటలు పరిశీలించేందుకు కేసీఆర్ రాగా దొంగలు తమచేతి వాటం ప్రదర్శించి జేబుల్లోని డబ్బులను దొంగిలించారు. తమ జేబుల్లోని డబ్బులను దొంగిలించాడని ఒకరిని స్థానికులు పట్టుకుని నిలదీయగా డబ్బులు వారికిచ్చి వెళ్లిపోయాడు. కార్యక్రమం ముగిసిన తర్వాత కొంత మంది తమ జేబుల్లోని డబ్బులు పోయాయని ఒకరికొకరు చెప్పుకోవడం కనిపించింది.

తుక్కు గూడ బహిరంగ సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రభాత రావు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 5: కాంగ్రెస్‌పార్టీ తుక్కు గూడలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ టీపీసీసీ సమన్వయకర్త సుప్రభాతరావు కోరారు. డీసీసీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తుక్కుగూడ సభ వేదికగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ పాల్గొననున్నట్లు తెలిపారు. బహిరంగసభను విజయవంతం చేసేందుకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో మానకొండూర్ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో కరీంనగర్ నియోజకవర్గం నుంచి వెయ్యి మందిని తరలించడం కోసం బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో నాయకులంతా సమన్వయంతో పనిచేసి కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థిని గెలిపించడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సిరాజుహుస్సేన్, కార్యదర్శి సిరికొండ శివప్రసాద్ పాల్గొన్నారు.

● శనివారం తుక్కుగూడలో జరిగే జన జాతర బహిరంగ సభకు జిల్లా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. బహిరంగ సభకు జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీజేపీ నాయకుల రైతు దీక్ష

- ప్రభుత్వం అన్నదాతలకు చేయూతనివ్వాలి
- ఎకరానికి రూ.25వేల నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్



జమ్మికుంటలో రైతు దీక్ష చేపడుతున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట, ఏప్రిల్ 5: జమ్మికుంట పట్టణంలోని తన నివాసంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ శుక్రవారం రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో సాగు నీరు అందక పలు ప్రాంతాల్లో రైతుల పంటలు ఎండి పోయాయన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో చేతికి అందచ్చే పంటలు నష్టపోవడం జరిగిందన్నారు. ఎకరాకు రూ.10వేల చొప్పున ఇస్తామన్న నష్టపరిహారం ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఎకరాకు రూ.25వేల వరకు నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజేందర్, కర్ర సంజీవరెడ్డి, కొండం రవీందర్‌రెడ్డి, లింగంపల్లి శంకర్, పల్లపు రవి, ఠాగూర్ రాజేష్, కొండ్లె నాగేష్, రామ్, ప్రశాంత్, రవికుమార్, నిరుపారాణి, శ్రీనివాస్, విజయ్, అశోక్, సమ్మయ్య లక్ష్మి, భాగ్య, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలోని తన నివాసంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు రైతు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో పుల్లూరు ఈశ్వర్, కర్ర సంజీవరెడ్డి, శంకర్, ఐలయ్య, రాజయ్య, సంపత్‌రావు, రవి, శేఖర్, లింగమూర్తి, రవికుమార్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మాడ వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, కొంరయ్య, జైపాల్, నరేందర్, అశోక్, సారయ్య, సంపత్, రాములు, రాజిరెడ్డి, శివారెడ్డి, సాయి, రవీందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుప తిరెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, శీలం శ్రీనివాస్, రమేష్, సాంబయ్య, శ్రీనివాస్, షఫీఖాన్, పవన్‌రెడ్డి, శంకర్, సమ్మయ్య, రాజు, రమేష్, సంపత్, విజయ్, జగన్‌రెడ్డి, అజయ్, విశ్వేష్ పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నదని బీజేపీ కొత్తపల్ల మండల శాఖ అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్‌అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని ఎలగందల గ్రామంలో రైతు దీక్ష చేపట్టారు. రైతు దీక్షను బీజేపీ అసెంబ్లీ కన్వినర్ దుబాల శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వేముల అనిల్‌కుమార్, ఓబీసిమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టవేని రేణు, యువమోర్చా మండల అధ్యక్షుడు ప్రశాంత్, కడారి శ్రీనివాస్, శ్రీనివాస్, రవి, వంశి, సదానందం, మల్లారెడ్డి, రాజు, మల్లేశం, ఆనంద్, సురేష్, శ్రవణ్, రాజశేఖర్, కిరణ్ పాల్గొన్నారు.

మానకొండూర్: రాష్ట్రప్రభుత్వం రైతులను విస్మరించిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు భాస్కరాచారి అన్నారు. ఆరోపించారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ గృహంలో శుక్రవారం రైతు సత్యాగహ దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎడబోయిన రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రావుల శంకరాచారి, పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని మైలారంలో బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో రైతు దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి వీరగోని వెంకటేష్, నాయకులు శ్రీనివాస్, పర్శరాంరెడ్డి, రమణారెడ్డి, జైపాల్‌రెడ్డి, మహేష్ స్వామి, రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు రైతు దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు చెన్న మాధవ్, నరసింహారాజు, కర్రె సంజీవరెడ్డి, లింగంపల్లి శంకర్, రవీందర్, సదానందం, సమ్మయ్య, రమేష్, దేవాల్‌రెడ్డి, మల్లారెడ్డి, గోపీనాథ్, సదా నందం, అజయ్, రఘు, రమణారెడ్డి, సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో రైతుదీక్షలో పాల్గొన్న నాయకులు



గన్నేరువరం మండలం మైలారంలో..



శంకరపట్నంలో..

రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 5: కరీంనగర్ రూరల్ మండలం ఎలబోతారం గ్రామశివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాహెర్‌కొండాపూర్‌కు చెందిన కనవేని తిరుపతి(35) దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్న తిరుపతి ఉదయం 11 గంటల సమయంలో ఎలబోతారంలో హార్వెస్టర్ నడిపేందుకు డ్రైవర్‌గా పనికోసం తన బైక్‌పై వెళుతుండగా ఎలబోతారం వద్ద బైక్ అదుపుతప్పటంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై నుంచి ఎగిరి పక్కనే పొలంలో పడిన తిరుపతి ముఖభాగం బురదలో చిక్కుకుంది. అప్పటికే తలకు తీవ్రగాయాలవటంతో శ్వాస ఆడక మృతి చెందాడు. మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఘనస్వాగతం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పొలంబాట కార్యక్రమంలో పాల్గొనేం దుకు వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ, లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్ నుంచి రోడ్డు మార్గంలో కరీంనగర్‌కు చేరుకున్న కేసీఆర్‌కు మానేరు బ్రిడ్జి సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌పై అభిమానం చాటుకున్న యువకుడు



కేసీఆర్‌కు పచ్చబొట్టు చూపుతున్న ప్రశాంత్

చిగురుమామిడి, ఏప్రిల్ 5: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కత్తుల ప్రశాంత్‌యాదవ్ తన చేతిపై పచ్చబొట్టుతో మాజీ సీఎం కేసీఆర్ బొమ్మను వేసుకొని తన అభిమానాన్ని చాటుకున్నాడు. శుక్రవారం కరీంనగర్ జిల్లాకు ఎండిపోయిన పంటల పరిశీలనకు వచ్చిన కేసీఆర్‌కు తన చేతిపై వేసుకున్న బొమ్మను చూపించడంతో ప్రశాంత్‌ను ఆయన అభినందించారు.

గసికంటి సంజీవ్‌కు ఉగాది పురస్కారం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత, గసికంటి సంజీవ్ అందుకున్నారు. ఉగాది పురస్కరించుకొని సిద్దిపేట జిల్లాలో వెన్నెల సాహితి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా సాహిత్యరంగంలో విశిష్ట సేవలందించినందుకుగాను వేముగంటి నర్సింహాచార్యుల రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాన్ని జిల్లా కేంద్రానికి చెందిన గసికంటి సంజీవ్‌కు ప్రదానం చేశారు. జిల్లా ప్రముఖులు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ నలిమెల భాస్కర్, వారాల ఆనంద్, ఎస్సార్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కలువకుంట్ల రామకృష్ణ, కవులు అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, నాగభూషణం అభినందించారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 5: పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువుతో దెబ్బతిన్న పంటలక వెంటనే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. పంటలు నష్టపోయి ఆర్థికంగా దెబ్బతిన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ప్రకటించిన పది వేల నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలన్నారు. ధాన్యం క్వింటాలుకు 500రూపాయలు బోనస్ ఇవ్వాలన్నారు. రైతు సంఘం నాయ కులు బండ రాజిరెడ్డి, పొనగంటి కేదారి, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, పున్నం కనకయ్య, మహేష్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ మెస్ ఛార్జీలు విడుదల చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 5: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో 17వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో పెండింగ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంపెల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్, అభిలాష్, వినయ్, శ్రీజ, పూజ, సందేశ్, రాకేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అవగాహనకు సైకిల్ యాత్ర

గంగాధర, ఎప్రిల్ 5: నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సామాజిక కార్యకర్త పినిశెట్టి రాజు అన్నారు. కోహెడ మండలం వేంకటేశ్వరపల్లికి చెందిన పినిశెట్టి రాజు ఓటు హక్కు అవగాహనపై చేస్తున్న సైకిల్ యాత్ర శుక్రవారం గంగాధరకు చేరుకుంది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించేందుకే ఈ యాత్ర చేపట్టానని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 5: మండలంలోని తోకలపల్లి గ్రామంలోని ప్రధాన రహదారిలోని ఎస్‌బీఐ బ్యాంకు ఆవరణలో వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం జన వికాస ఆధ్వర్యంలో జలదానం చలివేంద్రాలను గుజ్జ సరిత-శ్రీనివాస్‌రెడ్డి, అంబాల కుమారస్వామిలు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్స్ ఖా జాబీ, లీలావతి, రజిత, సరోజన, లావణ్య, సుల్తానా, జయబునిస పాల్గొన్నారు.

రైతులపై మొసలి కన్నీరుకారుస్తున్న కేసీఆర్

భగత్‌నగర్, ఏప్రిల్ 5: రైతులపై మాజీ సీఎం కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మాట్లాడుతూ అనాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా రామడుగు వచ్చి నష్టపోయిన రైతులకు పదివేలు ఇస్తామని మోసం చేశారన్నారు. సీఎం హోదాలో ప్రకటించిన నష్టపరిహారానికి అతిగతి లేదన్నారు. నేడు రైతుల పేరిట రాజకీయం మొదలు పెట్టిందన్నారు. ప్రతిపక్ష నేతగా రైతుల గురించి మాట్లాడి రాజకీయాలు చేయకుండా రైతుల సమస్యల పరిష్కారం కోసం తగిన కృషి చేస్తే మంచిదని సూచించారు.